# కైవల్యం!



బస్సు కిటకిటలాడుతోంది కొత్త సినిమా మొదటి ఆటలాగా. కండక్టరు జనాన్ని తోస్తోనే వున్నాడు చాకలి బుట్టలోకి మాసినబట్టలు కూరినట్టు. దిగేవాళ్లు లేకపోయినా ఎక్కేవాళ్ళని సర్దుతోనే వున్నాడు.

కొండమీద దేవుడి కల్యాణం. బస్సుల రాకపోకలకి అంతూపంతూ లేదు. భక్తుల ఇక్కట్లకి – తిరిగి వస్తోన్న గుళ్ళకి కూడా లెక్కాజమా లేదు.

'ఓయ్! ఓయ్!' అంటూ ఒగురుస్తూ పరిగెత్తుకొచ్చాడు షావుకారు. కదలబోయిన బస్సు కదలలేదు.

షావుకారు పుట్‌బోర్డుమీద కాలుపెట్టడం—'రైట్' అంటూ కండక్టర్ అంపడం—బస్సు ఒక్క వూపుతో కదలడం – షావుకారు తృళ్ళిపడి నిలదొక్కుకోడం—అన్నీ ఏకకాలంలో జరిగి పోయాయి.

'ఏ. బోయ్! మడిసి పూర్తిగా ఎక్కక్కర్లేదూ?' అంటూ షావుకారు కొంచెం కోపం చేశాడు కండక్టర్ మీద.

'ఇహిహి...! లేట్‌లో పోతంది సాక్ బండి! ఎల్లండి ... ఎల్లండి. ఆ కుర్రోడి పక్కన కూచోండి.' అంటూ ఓ మందహాసం విసిరి షావుకార్ని చల్లబరిచాడు కండక్టరు— షావుకారు కొట్లో కండక్టర్‌కి వంద రూపాయల పైనే అప్పు ఎకౌంటు వుంది.

షావుకారు రెండో మెట్టుకూడా ఎక్కి వస్తోంటే అప్పలకొండకి దడపుట్టింది. పాపం అప్పలకొండ నిజంగా నాగేశ్వర్రావులాగే వుంటాడు. అయినా వాళ్ళ మామ్మ మనవడి మంచిచెడ్డల మీద పెత్తనం తీసుకుని – సింహాద్రి అప్పన్నమీద తనకున్న భయభక్తులన్నీ కూడగట్టి – ఆ ముద్దుపేరు పెట్టింది.

పెరిగి పెద్దవాడై కాలేజీలో చదువుతోన్న అప్పలకొండకి తన పేరులో బొత్తిగా ముద్దు కన్పించ లేదు. ఓరోజు అమ్మాయిలు ఫక్కుమని నవ్వుకోడం విని యింటికి వెళ్ళి వెళ్ళగానే వాళ్ళ మామ్మమీద విరుచుకుపడ్డాడు.

'అసలు నీకేంహక్కుంది' అన్నాడు వెళ్ళి వెళ్ళగానే.

'ఏవింట్రా? ఏవిటి? అసలు గొడవేంటీ?'

'అదే నేనడుగుతున్నాను. నీకెందుకీ వెధవ గొడవంటాను?'

'ఛా! భడవా! నోర్ముయ్! అసలు సంగతి చెప్పవేం?'

'నేనేం చెప్పను– నాపేరు మార్చేసుకుంటాను — ప్రదీప్ అని పెట్టేసుకుంటాను. కిషోర్ అని పెట్టేసుకుంటాను – లేకపోతే అక్కినేని నాగేశ్వర్రావని పెట్టేసుకుంటాను అం! అంతే!'

'అయ్యో! అయ్యో! అపచారంరా అప్పన్నా! ఇంకెప్పుడు అనమాకు'

'అంటాను, అంటాను — నువ్వు

ముప్పాళ
రంగనాయకమ్మ

